జాబ్‌మేళాలో 75 మంది ఎంపిక

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఎల్అండ్‌టి కంపెనీలో ఉద్యోగ అవకాశాలకు భద్రగిరి ఆర్ఐటిఐలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు 100 మంది హాజరయ్యారు. వీరిలో 75 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఐటిఐ పాసైన 10 మంది, ఇంటర్మీడియట్ పాసైన నలుగురు ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఐటిఐ రెండో సంవత్సరం చదువుతున్న 61 మంది విద్యార్థులు జాబ్‌మేళాలో ఎంపికైనట్లు చెప్పారు. ఆగస్టుతో ఐటిఐ చదువు పూర్తయ్యాక సెప్టెంబర్ 18 నుంచి కంపెనీలో ఉద్యోగాల్లో చేరుతారని వెల్లడించారు. వీరికి జాయినింగ్ ఆర్డర్స్ అందించారని తెలిపారు.

శ్రీనివాస్, సంధ్యారాణిలకు
మంత్రి పదవులు

సీనియర్లకు తప్పని నిరాశ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరికి చోటు లభిస్తుందన్న దానిపై ఉత్కంఠ వీడింది. గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్, సాలూరు ఎమ్మెల్యే సంధ్యారాణిలకు మంత్రి పదవులు వరించాయి. ఈ మేరకు వీరిద్దరూ రాష్ట్ర మంత్రులుగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇంకా శాఖలు కేటాయించాల్సివుంది. మంత్రి పదవులు వరించడంతో వీరి అనుయాయులు ఆనంద డోలికల్లో మునిగితేలుతున్నారు. సీనియర్ ఎమ్మెల్యేలు, మంత్రుల్లో మాత్రం నిరాశ నెలకొంది. శ్రీనివాస్ రాజకీయ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి కొద్ది నెలల క్రితమే వచ్చి, నేరుగా ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిచి విజయం సాధించడం, తొలి విజయంతోనే రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు లభించడం జిల్లాలో సంచలనంగా మారింది. ఎక్కడ చూసినా శ్రీనివాస్‌కు వచ్చిన రాజకీయ అవకాశాలపైనే చర్చ నడుస్తోంది. మంచి పాలన అందించడంతోపాటు జిల్లాను ప్రగతి పథంలో నడిపించ గలిగితే ఆయనకు రాజకీయంగా మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రజలు చర్చించు కుంటున్నారు. అటు సంధ్యారాణి తప్పకుండా మంత్రి అవుతారంటూ అందరూ ఊహించినట్టే జరిగింది. టిడిపిలో యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో 30శాతం మంది యువకులైన కొత్తముఖాలకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా శ్రీనివాస్‌కు సీటు లభించింది. దీనికితోడు సామాజిక తరగతి కూడా కలిసిరావడంతో శ్రీనివాస్‌ను మంత్రి పదవి వరించింది.

అనూహ్యంగా మంత్రి పదవి దక్కించుకున్న శ్రీనివాస్

గజపతినగరం నియోజకవర్గం నుంచి ఎన్నికైన శ్రీనివాస్‌ను మంత్రి పదవి అనూహ్యంగా వరించింది. దీంతో ఆయన నియోజకవర్గం నుంచి మంత్రి పదవులు పొందిన వారిలో రెండోవ్యక్తిగా నిలిచారు. 1983లో టిడిపి ఆవిర్భావం తరువాత ఇప్పటి వరకు పది ఎన్నికలు జరిగాయి. ఇప్పటి వరకు టిడిపి ఆరుసార్లు విజయం సాధించింది. 1983లో టిడిపి నుంచి జెఎస్ఎన్ రాజు గెలవగా, 1985లో కాంగ్రెస్ తరపున వంగపండు నారాయణప్పల నాయుడు విజయం సాదించారు. ఆ తరువాత 1989, 1994, 2004లో పడాల అరుణ విజయం సాధించారు. ఈ సమయంలో ఆమె రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా వనిచేశారం. గజపతి నగరం నియోకవర్గానికి మంత్రి పదవి రావడం అదే తొలిసారి. తాజా ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి అప్పలనర్సయ్యపై టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ 25,304 ఓట్ల ఆదిక్యంతో విజయం సాధించారు. 1980 దశకానికి ముందు జరిగిన ఎన్నికల్లో ఇక్కడి నుంచి కాంగ్రెస్, సోషలిస్టు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా అనేక మంది పోటీచేసినప్పటికీ మంత్రి పదవులు దక్కలేదు. ఈ రకంగా గజపతినగరం నియోజకవర్గం నుంచి శ్రీనివాస్ రెండో మంత్రిగా చెప్పుకోవచ్చు.

కలిసొచ్చిన రాజకీయ వారసత్వం

శ్రీనివాస్ తొలి ప్రయత్నంలోనే మంత్రి కావడం వెనుక కుటుంబ రాజకీయ వారసత్వం కలిసొచ్చింది. ఆయన తాత కొండపల్లి పైడితల్లి నాయుడు టిడిపి ఆవిర్భావం నుంచి టిడిపిలో ఉన్నారు. బొబ్బిలి ఎంపీగా మూడుసార్లు ఎన్నికయ్యారు. ఒకసారి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, సుదీర్ఘకాలం ఉమ్మడి విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. ఆతరువాత ఆయన చిన్నాన కెఎ నాయుడు రెండు దఫాలు గజపతినగరం నుంచి పోటీచేసి ఒకసారి విజయం, మరోసారి అపజయం పొందారు. తండ్రి కొండపల్లి కొండలరావు గంట్యాడ ఎంపిపిగా పనిచేశారు. తాజా ఎన్నికలు శ్రీనివాస్‌ను ఏకంగా రాష్ట్ర మంత్రిగా చేశాయి.

సాలూరు నుంచి మూడో మంత్రిగా సంధ్యారాణి

సాలూరు నియోకవర్గం నుంచి మూడో మంత్రిగా గుమ్మడి సంధ్యారాణి అవకాశం దక్కించుకున్నారు. టిడిపి ఆవిర్భావం తరువాత వరుసగా జరిగిన రెండు సాధారణ ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బోయిన రాజయ్య మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత గత ఎన్నికల్లో వైసిపి తరపున గెలిచిన పీడిక రాజన్నదొర ఇదే నియోజకవర్గం నుంచి మంత్రిగా, డిప్యూటీ సిఎంగా పనిచేశారు. తాజాగా సంధ్యారాణికి మంత్రి పదవి వరించింది. గుమ్మడి సంధ్యారాణి సాధారణ కార్యకర్త నుంచి మంత్రి వరకు ఎదిగారు. 2009లో టిడిపిలో చేరిన ఆమె తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. 2015 - 21 వరకు ఎమ్మెల్సీగా పనిచేశారు. 1999లో కాంగ్రెస్ తరపున, 2009లో టిడిపి తరపున, 2014లో టిడిపి తరపున ఎంపీగా కూడా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఇలా అనేక సార్లు ఓటమి పాలైనప్పటికీ వెరవలేదు. మొక్కవోని దీక్షతో రాజకీయాల్లో కొనసాగుతూ వచ్చారు. ప్రస్తుతం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలిగా కూడా ఉన్నారు.

నేటి నుంచి
మోగనున్న బడి గంట

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలో గురువారం నుంచి బడి గంట మోగనుంది. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. 50 రోజుల పాటు పుస్తకాలు మూలన పడేసిన విద్యార్థులు స్కూల్ బ్యాగ్ నిండా పుస్తకాలు, చేతిలో క్యారేజీ, సైకిల్ మీద, ఆటోల్లో, బస్సుల్లో బడికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. విద్యార్థులకు ఘన స్వాగతం పలికేందుకు అన్ని పాఠశాలలు సిద్ధమయ్యాయి. విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు. విద్యార్థులకు స్వాగతం పలికేందుకు పాఠశాల ఆవరణం పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తయారు చేశారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1178, ప్రాథమికోన్నత పాఠశాలలు 73, హై స్కూళ్లు 88 ఉన్నాయి. మొత్తం 1339 పాఠశాలల్లో 59,688 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

పూర్తిగా రాని యూనిఫాం

ఈ ఏడాది విద్యార్థులకు స్టూడెంట్ కిట్ పేరుతో సామగ్రి పంపిణీ సిద్ధం చేస్తున్నారు. అందులో యూనిఫాం పూర్తిగా జిల్లాకు రాలేదు. 67 శాతం పాఠ్యపుస్తకాలు జిల్లాకు వచ్చాయి. బ్యాగులు 65.75 శాతం, షూలు 68,65 శాతం రాగా, బెల్టులు, నోట్ పుస్తకాలు పూర్తిస్థాయిలో చేరుకున్నాయి.

2 హైస్కూళ్లలో ఇంటర్ తరగతులు ప్రారంభం

ఈ ఏడాది జిల్లాలోని రెండు హైస్కూళ్లలో ఇంటర్ తరగతులు ప్రారంభించనున్నారు. సీతంపేట, గరుగుబిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఇక్కడ ఎంపిసి, సిఇసి గ్రూపులను ప్రారంభించారు.

విద్యార్థులకు ఘన స్వాగతం పలికేందుకు పాఠశాలలు సిద్ధం

నిలిచిన నాడు-నేడు పనులు

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రారంభించిన మనబడి నాడు-నేడు కార్యక్రమం నిధుల కొరతతో పడకేసింది. పనులు అస్తవ్యస్థంగా ఉండడంతో పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 737 పాఠశాలల్లో రూ.231.24 వేల కోట్ల అంచనాతో నాడు-నేడు రెండో విడత పనులను 2021 ఆగస్టులో ప్రారంభించారు. మూడు ఏళ్లు దాటిపోయినా ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులు కేవలం రూ.49.59 కోట్లే. మిగిలిన నిధుల విడుదలకు ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. వైసిపి ప్రభుత్వం ఓడిపోయి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. పాఠశాలలు పున: ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు వసతి సమస్య కలగనుంది.

విజయనగరం జిల్లాలో ఇదీ పరిస్థితి

విజయనగరం జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలు 1316 స్కూళ్లు, ప్రాథమికోన్నత పాఠశాలలు 184, హైస్కూళ్లు 310 ఉన్నాయి మొత్తం 1801 పాఠశాలలు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండగా. ప్రైవేటు విద్యా సంస్థలలో ప్రాథమిక పాఠశాలలు 127, ప్రాథమికోన్నత పాఠశాలలు 149, హై స్కూళ్లు 155 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బాలురు 67,604 మంది, బాలికలు 73,875 మంది మొత్తం 1,41,479 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో బాలురు 52,998మంది, బాలికలు 38,998 మంది మొత్తం 91,996 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 7672 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

63 స్కూళ్లలో సిబిఎస్ఇ సిలబస్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రాష్ట్ర విద్యతో పాటు కేంద్రీయ విద్యావిధానం అమలు చేయడంలో భాగంగా జిల్లాలో 63 పాఠశాలల్లో ఈ ఏడాది నుంచి సిబిఎస్ఇ సిలబస్‌ను అమలు చేస్తున్నారు. గత ఏడాది నుంచి దీన్ని అమలు చేస్తున్నారు.

ఏడు హైస్కూళ్లలో ఇంటర్ తరగతులు ప్రారంభం

జిల్లాలో ఏడు ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. గతేడాది ఎస్.కోట మండలం ధర్మవరంలో ప్రారంభం కాగా, జామి, కోనూరు, రామభద్రపురం, ఎ.వెంకటాపురం, బొండపల్లి, పిరిడిలో ఇంటర్ తరగతులకు ఈ ఏడాది నుంచి అనుమతించారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు

కుడుమూరు రైతులపై
కేసులు ఎత్తివేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-సాలూరు

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని పోరాడుతున్న రైతులు, మద్దతు తెలుపుతున్న నాయకులపై గత ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, మాజీ వైస్ ఎంపిపి టి.గౌరీశ్వరరావు, సర్పంచ్ సింహాచలం డిమాండ్ చేశారు. బుధవారం సాలూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ పాచిపెంట మండలంలో సర్వే నెంబర్-48లోని భూములను అనేక సంవత్సరాలుగా గిరిజనులు సాగు చేస్తున్నారని చెప్పారు. ఆ భూములపై కన్నేసిన కొంతమంది బడాబాబులు.. అవి మొఖాసాదారులవని వాదిస్తున్నారని చెప్పారు. ఇప్పటికీ రైతులను బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూముల సర్వే జరిగిందని, అవి ప్రభుత్వ భూములని అధికారులే ప్రకటించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా సాగుదారులకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు.

చేయూత లబ్ధిదారులతో కలిసి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి

'చేయూత'పై స్పష్టత ఇవ్వాలి

ప్రజాశక్తి-కొమరాడ

జగనన్న చేయూత పథకం కింద డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారా? లేదా? స్పష్టత ఇవ్వాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడ మండల కేంద్రంలోని సచివాలయం వద్ద చేయూత లబ్ధిదారులతో కలిసి ఆయన మాట్లాడారు. కొమరాడ మండల కేంద్రంలో సుమారు 60 మందికి పైగా జగనన్న చేయూత డబ్బులు అందక రెండు నెలలుగా బ్యాంకులు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో తమకు డబ్బులు వస్తాయో, రావోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వెంటనే అధికారులు స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు.

ఆలయ కమిటీ చైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలో తోటపల్లి గ్రామంలో వెంకటేశ్వర స్వామి, కోదండ రామ స్వామి దేవస్థానాల ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. బుధవారం వాటిని ఆలయ ఇఒకి అందజేశారు.

ఇలాగైతే దోమలు కుట్టవా?

- పిహెచ్‌సిలో ఓ గదిలో గుట్టలుగా దోమతెరలు
- గిరిజనులకు పంపిణీ చేయని వైనం

ప్రజాశక్తి-మక్కువ

గత ప్రభుత్వ హయాంలో గిరిజనులు దోమకాటు ద్వారా రోగాల బారిన పడకుండా ఉండేందుకు దోమతెరలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో దోమకాటుకు గిరిజనులు గురవుతూ అనేక రోగాల బారిన పడుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటికీ దోమతెరలు పంపిణీని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా చేపట్టారు. సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల్లో వీటిని చాలా వరకు పంపిణీ చేశారు. శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని చాలా వరకు గిరిజన ప్రాంతం ఉన్నప్పటికీ గిరిశిఖర గ్రామాలకు దోమతెరలు పంపిణీ కాలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంద పనసభద్ర పంచాయతీలోని గిరిశిఖర గ్రామాలతోపాటు షెడ్యూల్డ్ గిరిజన గ్రామం బీరమాసికి కూడా దోమతెరలు అందలేదని గిరిజనులు వాపోతున్నారు.

గదిలో దాచిన దోమతెరలు

శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాత భవనంలో దోమతెరలు గుట్టలుగా ఉన్నాయి. వాటిని ఎందుకు దాచి ఉన్నారన్నది ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. గిరిజనులకు చేరాల్సిన దోమతెరలను కొంతమంది ఉద్యోగులు గుట్టుగా పట్టణ ప్రాంతానికి తరలించుకు పోతున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వృథాగా గదిలో దోమతెరలను దాచడం కంటే వాటిని గిరిజనులకు పంపిణీ చేస్తే ఎంతో మేలు చేకూరుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గదిలో ఉన్న దోమతెరలు గిరిజన గ్రామాలలో పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

వంటావార్పు అక్కడే?

ఆరోగ్య కేంద్రంలో చిత్రవిచిత్రాలు సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. పిహెచ్‌సి సిబ్బంది ఉండడానికి గదులు చాలడం లేదంటున్నా.. వంటావార్పుకు మాత్రం గదిని కేటాయించడం విశేషం. ఇదే విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి కూడా చేరడంతో ఆ అధికారి కూడా ఆస్పత్రిలో వంటావార్పులు ఏమిటని మందలించినట్లు కూడా తెలిసింది. ఆస్పత్రి సిబ్బంది ఇలా స్థానికంగా వంటలు ఏర్పాటు చేసుకోవడం ఏమిటని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారి కూడా విషయాన్ని పెద్దగా పట్టించుకోకపోవడంపై కూడా పలు అనుమానాలకు తావిస్తోంది.

పిహెచ్‌సిలో వంటపాత్రలు

సంధ్యారాణికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సంధ్యారాణికి శుభాకాంక్షల వెల్లువ

ప్రజాశక్తి-సాలూరు

మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణికి టిడిపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. దాదాపు 20 ఏళ్ల తరువాత నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేయడం ద్వారా కార్యకర్తలు, నాయకులలో నూతనోత్సాహాన్ని నింపిన సంధ్యారాణికి శుభాకాంక్షలు వెల్లువలా వస్తున్నాయి. బుధవారం మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత పట్టణ సీనియర్ నాయకులు, అర్బన్ బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షులు పప్పల మోహన్ ఆమెని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, మండల నాయకులు భాస్కరరావు, పాచిపెంట మండల సీనియర్ నాయకులు ముఖి సూర్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు.

పూర్తిస్థాయిలో పుస్తకాలు పంపిణీ

డిఇఒ పగడాలమ్మ

ప్రజాశక్తి-కొమరాడ

పాఠశాలల ప్రారంభం రోజే పుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని డిఇఒ పగడాలమ్మ... విద్యాశాఖాధికారులను, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్తు హైస్కూల్లో పుస్తకాల పంపిణీని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పంపిణీ ఎంతవరకు, ఏయే పాఠశాలలకు చేపట్టారో ఆరాతీశారు. విద్యార్థి కిట్లు ఏ మేరకు పంపకాల జరిగాయని ఎంఇఒ-2 తిరుపతినాయుడును అడిగి తెలుసుకున్నారు. గురువారం ఉదయానికే పూర్తిస్థాయిలో అన్ని పాఠశాలలకు పుస్తకాలు, కిట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. పుస్తకాలు పంపిణీ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నుంచి మంగళవారం రాత్రి సమాచారం రావడంతో పుస్తకాల పంపిణీ వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎక్కడ, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని ఆదేశించారు. ఎంఇఒ జామి నారాయణస్వామి మాట్లాడుతూ మండలంలోని 5782 మంది విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, షూలు, బెల్టులు వచ్చినట్లు తెలిపారు.

సీతానగరం.. పాఠ్యపుస్తకాల పంపిణీని పరిశీలిస్తున్న డిఇఒ పగడాలమ్మ

పూర్తిస్థాయిలో పుస్తకాలు వచ్చాయా?

కొమరాడ మండలంలో ప్రతి ఏటా పుస్తకాల పంపిణీలో కొంతమేరకు ఆలస్యమవుతోంది. కొన్ని పాఠశాలకు పుస్తకాలు, కిట్లు అందని పరిస్థితి ఏటా కొనసాగుతూనే ఉంది. కానీ ప్రతి ఏడాదీ పుస్తకాలు పూర్తిస్థాయిలో వచ్చాయని, పంపిణీ చేశామని విద్యాశాఖ అధికారులు లెక్కలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పుస్తకాలు పూర్తి స్థాయిలో పంపిణీ కావడం లేదు. ఈ ఏడాదైనా పూర్తిస్థాయిలో విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు పంపిణీ చేస్తారా? లేదా? అన్న ప్రశ్న తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతోంది.

సీతానగరం : ప్రతి విద్యార్థికీ కిట్లు అందజేయాలని డిఇఒ డి.పగడాలమ్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామగ్రిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఏ సమస్యా రాకుండా చూడాలని, ప్రతి విద్యార్థికీ పుస్తకాలు, కిట్లు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలపై కేంద్ర బృందం ఆరా

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్రబృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి బృందం సభ్యులు ఆరా తీశారు. ముఖ్యంగా ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా? లేదా? అని వైద్యాధికారి జి.వెంకట రమణను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన మందులు పంపిణీ, దస్త్రాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, పిహెచ్‌సితోపాటు సబ్ సెంటర్లో అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో వైద్యసేవలు గుర్తించేందుకు పి.కోనవలస సబ్ సెంటర్‌ను పరిశీలించారు. బృందంలో డాక్టర్ బాలు మోటో. డాక్టర్ హిమక్యోర్ డాల్‌తోపాటు రాష్ట్ర అధికారులు. డాక్టర్ శాంతి సౌందర్య, డాక్టర్ పిఎల్ రఘుకుమార్ తదితరులు ఉన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న కేంద్ర బృందం

ఎక్కడి సమస్యలు అక్కడే

మారని పాఠశాలల స్థితిగతులు • నేటి నుంచి పాఠశాలల పున:ప్రారంభం

వీరఘట్టం బిసి కాలనీ పాఠశాలలో ఇరుకైన గదిలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు (ఫైల్)

ప్రజాశక్తి-వీరఘట్టం

అన్ని శాఖల కంటే విద్యాశాఖకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తుందే తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. అరకొర వసతుల నడుమ గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి.

మండలంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు 10, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 11, ప్రాథమిక పాఠశాలలు 39, కెజిబివి, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. వీటిలో సుమారు 4372 వ ం ది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. దాదాపు 50 రోజుల తర్వాత గురువారం నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి .

ఇరుకైన గదిలో బోధన

మండల కేంద్రంలోని బిసికాలనీ పాఠశాల, రెగ్యులర్ పాఠశాల, గడగమ్మ, చిట్టపూడివలస, యు.వెంకంపేట, చిదిమి, నడిమికెళ్ల, కిమ్మి, నీలానగరం, తదితర గ్రామాల్లో పాఠశాల భవనాలు సరిపడక పోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. యు.వెంకంపేటలో ఒకే ఒక్క భవనం ఉండడంతో ఒకవైపు విద్యార్థులు, మరోవైపు వంటలు చేయడం వల్ల ఇటు విద్యార్థులు, అటు వంట నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆరుబయట వంటలు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్న పాఠశాలతో పాటు ఎం.రాజపురం, చిట్టపూడివలస, బిటివాడ, పివిఆర్ పురం, కూరాకులవీధి, గడగమ్మ, చిదిమి, తెట్టంగి, సంత నర్సిపురం, దీరుగా తదితర పాఠశాలలో వంట గదులు లేవు. దీంతో నిర్వాహకులు ఆరుబయట వంటలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కోమటివీధి, పెద్దూరు, సంధిమానుగూడ, కొంచ పాఠశాలల్లో వంటగదులకు స్థలం లేకపోవడంతో నిర్వాహకులు ఇంటివద్ద వంటలు చేస్తున్నారు. ఆహార పదార్థాలు తయారు చేశాక పాఠశాలకు తీసుకొచ్చి విద్యార్థులకు భోజనం పెడుతున్నారు.

శిథిలమైన భవనాల్లో తరగతులు

మండలంలోని పెద్దూరు, పాపంపేట, యు.వెంకంపేట, డిపివలస, కొంచ, సందిమానుగూడ, కడకల్లా, కంబరవలస, కొత్తకిమ్మి, తదితర గ్రామాల్లోని పాఠశాలలు శిథిలావవస్థకు చేరుకున్నాయి. గతేడాది సెప్టెంబర్ 19న పాపంపేటలో పాఠశాల వెనుక గోడ కూలిపోయింది. పాఠశాల అనంతరం గోడ కూలిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది.

రక్షణ గోడలు

మండలంలోని పివిఆర్ పురం, కొంచ, సందిమానుగూడ, గాదిలంక, యు వెంకంపేట, కడకల్లా, చేబియ్యంవలస, పాపంపేట, బొడ్లపాడు, కొత్తకిమ్మి, కంబరవలస, సంత నర్సిపురం, సిదిమి, బిటివాడ, తదితర గ్రామాల పాఠశాలకు రక్షణ గోడలు లేవు. పివిఆర్ పురం, యు.వెంకంపేట, సందిమానుగూడ పాఠశాలలు రోడ్డు పక్కన ఉన్నందున ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. గాదిలంకలో వెదురు కర్రలతో, కడకెళ్లలో పాఠశాల చుట్టూ ఇనుప ఊచలతో కంచెను ఏర్పాటు చేశారు.

అరకొర పుస్తకాలు

వీరఘట్టం మండల స్టాక్ పాయింట్‌కి విద్యా కానుక పాఠ్యపుస్తకాలు అరకొరగా వచ్చాయి. 1, 2, 6, 8, 9, 10 తరగతులకు పూర్తిస్థాయిలో పుస్తకాలు వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మూడో తరగతిలో గణితం, ఆంగ్లం రీడర్, ఇవిఎస్ వర్క్ పుస్తకాలు, ఐదో తరగతిలో తెలుగు, ఆంగ్లం రీడర్ పుస్తకాలు వచ్చాయి. నాలుగు, ఏడు తరగతులకు పూర్తిస్థాయిలో పుస్తకాలు రాలేదని ఎంఇఒలు చెబుతున్నారు.

కంబరవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు పరిశీలించిన డిఇఒ పగడాలమ్మ (ఫైల్ ఫొటో)

వీరఘట్టం జిల్లా పరిషత్తు ఉన్నత బాలుర పాఠశాలలో ఆరు బయట వంటలు చేస్తున్న నిర్వాహకులు

సంధ్యారాణికే కిరీటం

టీచర్ నుంచి మంత్రి వరకు • ఇంతింతై అన్నట్టుగా ఎదిగిన సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

గిరిజన సంక్షేమశాఖలో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన గుమ్మడి సంధ్యారాణిని అమాత్య పదవి వరించింది. బుధవారం ఆమె రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడిన నూతన మంత్రివర్గంలో ఆమె చోటు దక్కించుకున్నారు. ఎస్‌టి కోటాలో గెలిచిన ఐదుగురు ఎమ్మెల్యేలు వున్నప్పటికీ పార్టీలో సీనియర్ నాయకురాలు కావడం, 2014లో టిడిపి ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్సీ గా పని చేయడం తో ఆమెకు మంత్రిగా స్థానం సంపాదించడానికి అనుకూల అంశాలు గా వున్నాయి. మక్కువ మండలం కవిరిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే జన్ని ముత్యాలు కుమార్తెగా ఆమె రాజకీయ అరంగేట్రం చేశారు. 1999లో కాంగ్రెస్ పార్టీతో మొదలైన ఆమె రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యే గా, ఒకసారి ఎంపీగా ఓటమి చవిచూసినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఐసిడిఎస్ రీజినల్ ఆర్గనైజర్‌గా, ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా నామినేటెడ్ పదవులను అలంకరించారు. 1999లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే పదవికి పోటీ చేసి ఓడిపోయారు. 2004లో ఆమెకు కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కలేదు. 2009లోనూ కాంగ్రెస్ పార్టీ సీటు దక్కదని నిర్ణయించుకుని టిడిపిలో చేరారు. అప్పుడు టిడిపి టికెట్ సాధించి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి టిడిపిలో కొనసాగుతూ ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీలో నిలదొక్కుకున్నారు. 2014 ఎన్నికల్లో టిడిపి సీటు కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఎంపిగా పోటీ చేసి ఓటమి చెందారు. అప్పుడు అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం లో ఎమ్మెల్సీ పదవి దక్కింది. తర్వాత పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా అధిష్ఠానం నియమించింది. 2019 ఎన్నికల్లోనూ టిడిపి సీటు కోసం ప్రయత్నించినా దక్కలేదు. తాజా ఎన్నికల్లో టిడిపి అధిష్ఠానం ఆమెకు ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఖరారు చేసింది. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా వున్న రాజన్నదొరపై ఆమె విజయం సాధించారు. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఎమ్మెల్యే గా గెలిచిన సంధ్యారాణికి ఆమె రాజకీయ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సిఎం చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో చోటు కల్పించారు.

పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్

నియోజకవర్గ టిడిపి శ్రేణుల్లో నూతనోత్సాహం పెల్లుబికింది. రాష్ట్ర మంత్రి వర్గంలో సంధ్యారాణికి చోటు దక్కడంతో నాయకులు, కార్యకర్తలలో పట్టలేని ఆనందం కనిపిస్తోంది. సంధ్యారాణికి గ్యారెంటీగా మంత్రి పదవి దక్కుతుందనే నమ్మకంతో నియోజకవర్గంలో వున్న నాలుగు మండలాలు, పట్టణానికి చెందిన నాయకులు కార్యకర్తలు మంగళవారం అమరావతి చేరుకున్నారు. తమ అభిమాన ఎమ్మెల్యే సంధ్యారాణి అమాత్యురాలిగా చేపట్టనున్న ప్రమాణస్వీకార ఉత్సవాన్ని ప్రత్యక్షంగా చూడడానికి వందలాది మంది కార్యకర్తలు నాయకులు అమరావతికి వెళ్ళారు.

నియోజకవర్గానికి మూడో మంత్రి

నియోజకవర్గం ఏర్పడిన తర్వాత ఇంతవరకు ఎన్నికైన ఎమ్మెల్యేలలో గుమ్మడి సంధ్యారాణి మంత్రిగా ఎన్నికైన వారిలో మూడో వ్యక్తి. టిడిపిలో ఆమె రెండో ఎమ్మెల్యే. 1982లో టిడిపి ఆవిర్భావం తర్వాత ఏర్పడిన ప్రభుత్వాల్లో ఎన్నికైన బోయిన రాజయ్య మొదటి సారి మంత్రి పదవి అలంకరించారు. ఆయన రెండు సార్లు మంత్రిగా పని చేశారు. తర్వాత 2019లో వైసిపి ప్రభుత్వం హయాంలో ఎన్నికైన రాజన్నదొర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవిని అలంకరించారు. 2024లో టిడిపి ప్రభుత్వం హయాంలో ఏర్పడిన మంత్రివర్గంలో సంధ్యారాణి స్థానం సాధించారు.

కురుపాంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రమాణ స్వీకారోత్సవ సందడి

సిఎంగా చంద్రబాబునాయుడు, మంత్రుల ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా సందడి వాతావరణం కనిపించింది. ఎక్కడికక్కడ ఎల్ఇడి స్క్రీన్లు, టీవీల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు ఆ కార్యక్రమాన్ని వీక్షించారు. పలుచోట్ల కేకులు కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు.

- ప్రజాశక్తి, విలేకర్ల బృందం

కురుపాం.. గొటివాడ కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు

జియ్యమ్మవలస, సాలూరు మండలాల్లో చంద్రబాబు ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంలో చూస్తున్న అధికారులు, సిబ్బంది

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

జాబ్ డీలర్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు బిసికాలనీ ప్రభుత్వ ఐటిఐలో ఈ జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. జాబ్ డీలర్స్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలో ఫ్రంట్ ఆఫీసు, టెలి కాలింగ్, హెల్పర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్స్, డ్రైవర్స్ మొదలగు 150 ఉద్యోగాలు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో అసిస్టెంట్ మేనేజర్, అడ్వయిజర్స్, పార్టనర్స్ తదితర 50 ఉద్యోగాల భర్తీ జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సిఎస్.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్స్ లాగిన్‌లో నమోదు చేసుకొని, ఈనెల 15వ తేదీ ఉదయం 10గంటలకు ప్రభుత్వ ఐటిఐలో జరిగే ఇంటర్వ్యూకు, సంబంధిత సర్టిఫికెట్ కాపీలు, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 8919179415 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

వసతిగృహాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వసతిగృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ (స్ప్రేయింగ్) పూర్తి కావచ్చిందని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు తెలిపారు. బుధవారం మలేరియా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలోని గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో దోమల మందు స్ప్రేయింగ్ చేయించినట్లు తెలిపారు. తద్వారా పాఠశాలల ప్రారంభం నాటికి దోమల ప్రభావం తగ్గి విద్యార్థుల్లో సీజనల్ జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఇప్పటికే మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి విడత దోమల మందు పిచికారీ కొనసాగుతుందన్నారు. 287 గ్రామాల్లో పూర్తి కావచ్చిందని తెలిపారు. ఇంకా 114 గ్రామాల్లో చేపట్టాల్సి ఉందని వివరించారు. వసతిగృహాల పరిధిలో వైద్య సిబ్బంది వద్ద అవసరమైన జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలు గ్రామాల నుండి హాస్టళ్లలో చేరే విద్యార్థుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది దృష్టిసారించాలన్నారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లా ఫిజికల్ సైన్స్ టీచింగ్ డైరీని బుధవారం డిఇఒ పగడాలమ్మ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల ఫోరం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు సైన్స్‌పై ఉండే భయాందోళన తొలగించే చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా సైన్స్ అధికారి గిరడ లక్ష్మణరావు రూపకల్పన చేసిన ఈ డైరీ 240 పేజీలతో వినూత్నంగా తయారు చేశారు. అన్ని అంశాలు డైరీలో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ పెంట రామకృష్ణ, ఎఎంఒ శ్రీనివాసరావు, ఎఎస్ఒ రామకృష్ణ, ఎపిఒ హరిప్రసాద్, మన్యం జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు సతీష్ రాజు, బెహరా సంతోష్, పెదప్రోలు శైలజ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-కొమరాడ

విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుజాత

మండలంలోని పరశు రాంపురం గ్రామంలో రైతులకు సర్పంచ్ మజ్జి సుజాత సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. రైతులకు ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న వరి విత్తనాలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.కిరణ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శంబాంలో పండగ సందడి

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో శంబాం గ్రామంలో గ్రామ దేవతల ఉత్సవాలను మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలో పండగ సందడి నెలకొంది. బుధవారం అనుప పండగ ఘనంగా నిర్వహించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకడా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఆర్‌కె కాలేజ్ డైరెక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు

'ఆర్‌కె'కి ర్యాంకుల పంట

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం పట్టణానికి చెందిన ఆర్‌కె జూనియర్ కళాశాలకు ఎపి ఇఎపిసెట్‌లో ర్యాంకుల పంట పండింది. బుధవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎంఇఒ సామల సింహాచలం అభినందించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో కళాశాల కరస్పాండెంట్ పి.రామకృష్ణ మాట్లాడుతూ ఆర్‌కె కళాశాలలో ఎంపిసి విద్యార్థులు 10 వేలలోపు నాలుగు ర్యాంకులు, బైపిసి విద్యార్థులు 5 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో కె.కీర్తన 6490 ర్యాంకు, ఎం.నాగేశ్వరి 8736 ర్యాంకు, పి.సాయి గణేష్ 9905 ర్యాంకు, సిహెచ్ తనూజ 10521 ర్యాంకు సాధించారన్నారు. బైపిసిలో ఎం.హితశ్రీ 586, జి.అక్షయ 2454, డి.ప్రణతి 2950, వికె శ్రావణి 10,095, జి.దివ్య 19,388 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఎంఇఒ సింహాచలం మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తెచ్చిన ఆర్‌కె యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో చక్కగా స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భూపాల్ తదితరులు ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించి అభినందించారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-సాలూరు

బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ఐసిడిఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన వీధి నాటకం ఆకట్టుకుంది. బుధవారం పట్టణంలోని బంగారమ్మపేట, బంగారమ్మ కాలనీ, చిన, పెదదళితపేటల్లో బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా కళా బృందాలతో అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిడిపిఒ బి.సత్యవతి చెప్పారు. ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, బాల్యవివాహాలు చేయొద్దని సూచించారు. ఆడపిల్ల చదివితే ఇంట్లో వారంతా చదివినట్లవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు భారతి, తిరుపతమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిమితికి మించితే చర్యలు

ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న జిల్లా రవాణా అధికారి శశికుమార్

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా అధికారి శశి కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా అధిక ప్రయాణికులతో ప్రయాణిస్తున్న ఆటోలను ప్రత్యేక తనిఖీలను నిర్వహించి, 37 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాహన పత్రాలు లేని కొన్ని ఆటోను సీజ్ చేసినట్లు చెప్పారు. జిల్లాలో 81 స్కూల్, కాలేజీ బస్సులలో ఇంతవరకు 60 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. మిగతా యాజమాన్యాలు వాహన తనిఖీలు చేయించుకోవాలని సూచించారు.

సీతానగరం : ఆటో డ్రైవర్లు నిబంధనలు తప్పక పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. జిల్లాలో ఇప్పటికే 37 ఆటోలకు సరిగ్గా పత్రాలు లేకపోవడంతో అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

గీత కార్మికులకు 40 శాతం వైన్‌షాపులను కేటాయించాలి

ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తెలుగుదేశం పార్టీ హామీ ఇచ్చిన విధంగానే రాష్ట్రంలో ఉన్న కల్లుగీత కార్మికులకు 40శాతం వైన్ షాపులను కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం విజయనగరం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం కెఎల్‌పురంలోని సిఐటియు కార్యాలయంలో గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జమ్మల అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిమ్మ అప్పారావు, జిల్లా కన్వీనర్ కొలుసు శ్రీను మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం యాత సాధికారత కార్పొరేషన్ చైర్మన్ పదవిని విజయనగరం జిల్లాకు కేటాయించాలని డిమాండ్ చేశారు. వైన్ షాపుల్లో ఉద్యోగులుగా కల్లు గీత కార్మిక కుటుంబాలకే అవకాశం కల్పించాలన్నారు. కల్లుగీత కార్మికులకు రూ.4వేలు ఫించను, చంద్రన్న భీమా కింద పది లక్షలు ఇవ్వాలన్నారు. గీత కార్మికులను ఇబ్బంది పెట్టే జిఒ నెంబర్ 677ను రద్దు చేయాలన్నారు. యాత కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో బంజరు భూమి, ఈనాం భూములు ప్రభుత్వ చెరువు గట్ల పై ఉన్న తాటి చెట్లను కల్లు గీత కార్మికులకు కేటాయించాలన్నారు. గీత కులస్తుల విద్యార్థులకు విద్యా పథకం కింద విదేశీ విద్య రుణ సదుపాయంకల్పించాలన్నారు. కల్లు గీత కార్మికులకు సామాజిక భవనాలు నిర్మించాలని కోరారు. కల్లును మత్తు పదార్థాల జాబితా నుంచి తొలగించి శీతల పానీయాలుగాగుర్తించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం కోశాధికారి బంగారు నాయుడు, యాత సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, శెట్టి బలిజ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు గుత్తుల మధు సూధన్ రావు, సొసైటీ ప్రెసిడెంట్లు అప్పల స్వామి, జి.దేవుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు పాఠ్య పుస్తకాలు, విద్యార్థి కిట్లను ఎంఆర్‌సిలో ఎంఇఒ సింహాచలం సమక్షంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ గురువారం నుంచి విద్యాప్రవేశ్ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. యూనిఫాం ఇంకా రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే వాటిని పాఠశాలలకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

పార్వతీపురంరూరల్ : పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్లను మండల, మున్సిపల్ పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు ఎంఇఒ సామల సింహాచలం తెలిపారు. పాఠ్య, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్ తదితర వస్తువులతో కూడిన స్టూడెంట్ కిట్లను స్థానిక ఎంఇఒ కార్యాలయం నుంచి ఎంఇఒ-2 కె.ప్రసాదరావు పర్యవేక్షణలో సిఆర్‌ఎంటిలు, పిటిఐల ద్వారా ఆయా పాఠశాలల పాయింట్ వద్దకు చేరవేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల యూనిఫాం ఇంకా రావాల్సి ఉందని చెప్పారు.

గరుగుబిల్లి : పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు అన్నారు. ఎంఆర్‌సి భవనంలో విద్యార్థి కిట్లు, పాఠ్యపుస్తకాలను పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు.

బాలకార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కోట జంక్షన్ నుండి మూడు లాంతర్లు వరకు బాలలు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ బాలలు తప్పకుండా బడిలో ఉండాలి తప్ప, పనిలో ఉండకూడదని అలాగే పనిలో ఎవరైనా చట్ట వ్యతిరేకంగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బాలలను పనిలో పెట్టుకుంటే వారిపై. భారీ గా జరిమానాలు విధించి, శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని, హెచ్చరించారు. డిసెంబర్ - 25 నాటికి పూర్తి స్థాయిలో బాలకార్మికులు లేని రాష్ట్రంగా తీర్చి దిద్దడానికి అందరి భాగస్వామ్యంతో ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటామని, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేసి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలన చేస్తున్నామని తెలిపారు. బాలల భద్రతకు, రక్షణకు, సంరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేసి వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి ఛైర్ పర్సన్ జి.హిమబిందు, వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు, దిశా పోలీసుస్టేషన్ సిఐ నర్సింగరావు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కార్మిక శాఖ అధికారులు ఎన్ .సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, చంద్ర శేఖర్, శ్రీనివాసరావు, కిరణ్, ఐసిడిఎస్ పీడీ జి.ప్రసన్న, మిషన్ వాత్సల్య సిబ్బంది యాళ్ల నాగరాజు, రామకోటి, వెంకటరావు , అప్పారావు ,చైల్డ్ లైన్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.